భక్తిశ్రద్ధలతో వాసవీ అమ్మవారి జన్మదిన వేడుకలు


మాచర్ల.. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సభ్యులు


పిడుగురాళ్ల.. కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు..


రెంటచింతలలో ప్రత్యేక అలంకరణ


రెంటచింతలలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

రెంటచింతల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో 102 మంది మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. దేవస్థానంలో నిర్వహించిన అమ్మవారి లడ్డు వేలంపాటలో పల్నూరి లక్ష్మీపతి రూ.9,116 దక్కించుకున్నారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం సోమిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంచికల్లు గ్రామంలో అన్నదానం చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని విశేషంగా అలంకరించారు. 8 గంటల సమయంలో పట్టణంలోని శివాలయం వద్ద నుంచి తీర్థాలు తీసుకొచ్చి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. 10 గంటల సమయంలో ఆర్యవైశ్య మహిళలు విశేష సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 7 గంటల సమయంలో అమ్మవారి గ్రామోత్సవ నిర్వహించారు. కోలాటం, వాయిద్యాలుతో వైభవపేతంగా చేపట్టారు. అనంతరం వేదస్వస్తి, పవళింపు కార్యక్రమాలను నిర్వహించారు.

మాచవరంలో..

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం, పిన్నెల్లి గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మాచర్ల రూరల్: వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు పట్టణంలోని పాత మాచర్లలోని దేవాలయంలో కమిటీ అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో అమ్మవారిని పాత మాచర్లలోని పలు వీధులలోనూ, పట్టణంలోని పలు వీధులలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రెటరీ సన్నిధి హనుమంతరావు, ఉపాధ్యక్షులు రంగా జనార్ధన్‌రావు, సత్యనారాయణ, చిన్ని చంద్రశేఖర్‌రావు, కూనిశెట్టి చిన వెంకటేశ్వర్లు, గుండా మల్లికార్జునరావు, జాయింట్ సెక్రెటరీలు భవనాశి రవితేజ, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కొత్త మాసు చెన్నకేశవరావు, చిన్ని ఆదిలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి, కొత్త శ్రీదేవి, వేముల విజయలక్ష్మి పాల్గొన్నారు.

కారెంపూడి మండలంలో..

కారెంపూడి: కారెంపూడిలో వేంచేసి ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అత్యంత వైభవంగా వేడుకలు జరుపుకున్నారు. రజిత కవచాలంకృత దేవిగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల ప్రసాదాలను అమ్మవారికి అర్పించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు మద్దు హనుమంతరావు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు ఎస్వీ ఆర్ కృష్ణ, కార్యదర్శి వెచ్చా సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూసార పరీక్షలు చేయించుకోవాలి



దాచేపల్లి: తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని ఏఓ డి.పాపకుమారి కోరారు. మండలంలోని గామాలపాడులో బుధవారం భూసార పరీక్షలు చేపట్టారు. పలువురు రైతుల పొలంలో నుంచి మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ఈ సందర్భంగా ఏఓ పాపకుమారి మాట్లాడుతూ... నేల మానవునికి ప్రకృతి సిద్ధంగా లభించిన గొప్ప సంపద అని, ప్రకృతిలో శిలల నుంచి నేలలు ఏర్పడతాయని చెప్పారు. పంటలు పండటానికి నేల ఒక ముఖ్యమైన సహజ వనరు మాత్రమేకాక పైరు నిలబడటానికి పెరుగుదలకు అవసరమైన తేమను, పోషకాలను మొక్కలకు అందిస్తుందని వివరించారు. నేలలో పోషకాల సమతుల్యతను పాటించడానికి రసాయన ఎరువుల సక్రమంగా వినియోగానికి భూసార పరీక్షలు దోహదపడతాయని, పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు కొంత పరిమాణంలో నేలలో సహజంగానే ఉంటాయన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు

గురజాల రూరల్: భూసార పరీక్షలలో పంట సాగు నిర్ధారణ చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి రైతులకు సూచించారు. గ్రామంలో పలు పంటలను పరిశీలించి మట్టి నమూనాలను బుధవారం సేకరించారు.

ఉగ్రవాదుల స్థావరాలపై దాడి హర్షణీయం

గురజాల: పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ ఆర్మీ జరిపిన దాడులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొంగర హరిసత్యనారాయణ, మందపాటి శ్రీనివాసరెడ్డి, చల్లా రామిరెడ్డి, కర్రా చినకోటేశ్వరరావు, కత్తి చలమరాజు, చాగంటి సురేష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



దాచేపల్లి: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. నారాయణపురంలో సీపీఐ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాలు విపరీతంగా పెరిగాయని, సామాన్యుడు బతికే పరిస్థితి లేదని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు 200 పని దినాలు కల్పించాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణరెడ్డి, మండల శాఖ కార్యదర్శి కొమెర వెంకట్రావు, నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, ప్రత్తిపాటి వెంకటనాగరాజు, తెలనాకుల సత్యనారాయణ, వెంకటరెడ్డి, శాంతి పాల్గొన్నారు.

రామారావుకు మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామారావు తండ్రి చింతా హనుమంతరావు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జి.ఇన్నయ్యరాజు పుట్టినరోజు సందర్భంగా బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. 23 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న హోంగార్డు సుభానిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్సై నరసింహారావు, దమ్మాలపాడు సర్పంచ్ కుమ్మరి ఏడుకొండలు, వెంకటరెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

11న సింగరుట్ల నృసింహస్వామి కల్యాణోత్సవం


స్వయంభు సింగరుట్ల నృసింహ స్వామి

కారెంపూడి: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం సింగరుట్ల నృసింహస్వామి కల్యాణోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్ శివనాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం గ్రామంలోని ఆలయం నుంచి ఉత్సవ మూర్తుల విగ్రహాలను సింగరుట్ల క్షేత్రాన్ని చేర్చే ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని వివరించారు. తర్వాత స్వామి సన్నిధిలో శ్రీ సుదర్శన, నారసింహ హోమాలు ఆలయ అర్చకులు మారేపల్లి వెంకట రమణాచార్యులు, విజయ కుమారాచార్యుల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీచక్ర సిమెంట్స్ సహకారంతో గ్రామ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

మూతబావి కాదు.. ఫిల్టర్ ట్యాంక్




దాచేపల్లి: తాగునీటి సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. తాగునీటిని అందించే ఫిల్టర్ ట్యాంక్ అపరిశుభ్రంగా మారింది. మండలంలోని పొందుగలలో తాగునీటిని శుభ్రం చేసే ఫిల్టర్ ట్యాంక్ చెత్తచెదారం, పాచి పెరుకుపోయింది. కృష్ణానది నుంచి పైపుల ద్వారా నీటిని పంపింగ్ చేసి ఈ ట్యాంక్‌లోకి చేర్చి ఫిల్టర్ చేసి ప్రజలకు అందిస్తారు. ఇంత అధ్వానంగా ఉన్న ఈ ట్యాంక్‌ని శుభ్రం చేసేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొకపోవటం లేదు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి: దారి దోపిడీ కేసులో నలుగురు నిందితులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు హాజరు పరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన పోకూరి మణికంఠ ఈ నెల 5న హైదరాబాదు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు నడిచి వెళుతుండగా పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య స్మృతి వనం సమీపంలో గుర్తు తెలియని దుండగులు నలుగురు ద్విచక్ర వాహనాలపై వచ్చి దాడి చేసి మణికంఠ వద్ద నుంచి ల్యాప్‌టాప్, బట్టల బ్యాగు అపహరించకపోయిన విషయం విదితమే. దీనిపై మణికంఠ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దోపిడీకి పాల్పడిన మున్సిపల్ ఏరియాకి చెందిన గొల్లపల్లి అచ్యుత్, రంగా కాలనీకి చెందిన నూర్ బాషా అమీర్‌లతో పాటు మైనర్‌లైన గర్నెపూడి చరణ్, గుబిలి సుబ్బారావులను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిని సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మరో ఇరువురు మైనర్లు అయినందున గుంటూరు జువనైల్ కోర్టులో హాజరు పరిచారు. నిందితుల నుంచి ల్యాప్‌టాప్, బట్టలు బ్యాగును పోలీసులు రికవరీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


షేక్ రంజాన్‌షరీఫ్

నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుండ్లపల్లి గ్రామం సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కొలుముల షేక్ రంజాన్‌షరీఫ్ (35) నరసరావుపేటలోని ఆయిల్ మిల్లులో పనిచేస్తాడు. డ్యూటీ ముగించుకొని నరసరావుపేట నుంచి గుండ్లపల్లికి ద్విచక్ర వాహనంపై పయనమయ్యాడు. ఈ క్రమంలో గుండ్లపల్లి సమీపంలో అరటికాయల లోడులో వెళ్తున్న ఆశోక్ లైలాండ్ వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య సీమా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

•వెలగని దీపం.. కాలనీలో అంధకారం


చిమ్మచీకట్లో ఎస్సీ కాలనీ వీధి

మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఎస్సీ కాలనీ ప్రజలు రెండు నెలలుగా వీధి దీపాలు వెలగక చీకట్లో అవస్థలు పడుతున్నారు. దొడ్లేరులోని ఎస్సీ కాలనీ నుంచి తిరుపతమ్మ తల్లి గుడి వరకు వీధి దీపాలు వెలగటం లేదు. దీనిపై స్థానికులు పంచాయతీ కార్యదర్శి వెంకయ్యను వీధి దీపాలు పెట్టాలని కోరగా త్వరలో బల్బులు పెట్టిస్తానని చెప్పి రెండు నెలలు కావస్తుందని తెలుపుతున్నారు. వీధి దీపాలు వెలగక వృద్ధులు, మహిళలు, రాత్రి సమయాల్లో బయటకు రావాలన్నా, ఇళ్లకు చేరాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. రోడ్లపై ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు, విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి ఎస్సీ కాలనీ వీధులకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– దొడ్లేరు(క్రోసూరు)

పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

ఎంపీడీఓ కోయ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

అచ్చంపేట: ప్రతి గ్రామంలో ఎక్కువ మంది రైతులు తమ భూముల్లో పండ్ల తోటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయం, దాని అనుబంధ శాఖలైన హార్టికల్చర్, ఉపాధి హామీ పథకం శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముందుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం 90 శాతానికి పైగా రాయితీ ఇస్తుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం 10 ఎకరాల్లోనైనా పండ్ల తోటలు వేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పండ్ల తోటలు ఎంతో ఉపయోగపడతాయని, ఈ తోటలలో ప్రతి యేటా ఆదాయాన్ని ఇచ్చే విధంగా అంతర్గత పంటలు కూడా వేసుకోవచ్చన్న విషయాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ అధికారి శ్రీనిత్య, ఉపాధి హామీ పథకం ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

క్రోసూరు: కిశోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, వారికి పౌష్టికాహారం అందించాలని, అదేవిధంగా బాల్యవివాహాలకు దూరంగా ఉంచాలని క్రోసూరు మండల ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు మాధవి, మైమున్నీసా, రత్నకుమారి అన్నారు. క్రోసూరులోని అంగన్‌వాడీ 8వ కేంద్రంలో (మేరీనా) కిశోర బాలికలు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రతపై తెలియజెప్పాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అటువంటివి జరిగితే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళా పోలీసు పద్మ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మేంద్రస్వామి ఆరాధన

సత్తెనపల్లి: కలియుగ ప్రత్యక్ష దైవం, భూత భవిష్యత్ వర్తమానంలో జరిగిన, జరగనున్న అనేక విషయాలను భక్తులకు బోధించిన కాలజ్ఞాన కర్త వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన బుధవారం పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో కొలువై ఉన్న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తితో జీవ సమాధి పూజను లక్ష మల్లెలతో నిర్వహించారు. ఆశ్రమం ధర్మకర్త మఠాధిపతి లలితాంబ మాతాజీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. ఆశ్రమ బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధనా మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆరాధన మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ట్రైకోడెర్మావిరిడితో నేల ద్వారా వ్యాపించే తెగుళ్లకు నివారణ



నకరికల్లు: ద్రవరూపంలో ఉన్న ట్రైకోడెర్మావిరిడి పొలంలో పిచికారీ చేయడం ద్వారా నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను అరికట్టవచ్చని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినుల ఆధ్వర్యంలో మండలంలోని చీమలమర్రి గ్రామంలో బుధవారం రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ద్రవరూపంలో ఉన్న ట్రైకోడెర్మావిరిడి తయారు చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి రైతులను కలసి సాగులో మెళకువలను వివరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థినులు జి.సుజిత, జి.సునీత, సీహెచ్ వైష్ణవి, ఎస్.వైష్ణవి, వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం ల్యాండ్ పూలింగ్


కర్లపూడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి: భవిష్యత్తరాల అభివృద్ధి కోసం రైతులు ల్యాండ్ పూలింగ్‌కు సహకరించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కర్లపూడి, లేమల్లె గ్రామాలలో భూ సమీకరణపై అవగాహన గ్రామ సభలలో ఆయా గ్రామస్తులతో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రాజధాని అమరావతి అభివృద్ధికి సహకరించి తద్వారా రైతులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేయటానికి రైతుల సహకారంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎవరికీ నష్టం కలిగించకుండా అందరిని రాజధాని అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులకు భూ సమీకరణపై ఉన్న అపోహలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ మండలంలో నాలుగు రెవెన్యూ గ్రామాలలో 1,235 మంది రైతుల నుంచి 9,634 ఎకరాల భూమి రాజధాని అవసరాల కోసం భూ సమీకరణ ప్రతిపాదనలను రైతులకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, ప్రజా ప్రతినిధులు కర్లపూడి, లేమల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త రైస్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

నకరికల్లు: కొత్తగా రైస్ కార్డుల మంజూరుకు గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైందని తహసీల్దార్ కె.పుల్లారావు బుధవారం తెలిపారు. రైస్ కార్డులకు సంబంధించి ఏడు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కొత్తగా రైస్‌కార్డు జారీ, కార్డుల విభజన, అడ్రస్‌లో మార్పు, ఆధార్ సీడింగ్ సవరణలు, కొత్త సభ్యులను చేర్చుకోవడం, సభ్యుల తొలగింపు, కార్డుల సరెండర్ లేదా రద్దు చేసుకోవడం లాంటి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం నూతన బియ్యం కార్డు మంజూరుకు అనుమతి ఇస్తూ జీవో(ఉత్తర్వులు) విడుదల చేసినట్లు తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ ఈ మేరకు అర్హులందరికీ బియ్యం కార్డులు ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ సచివాలయాల్లో బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు పొందవచ్చన్నారు. ఒంటరి మహిళలకు, ఆశ్రమాల్లో ఉన్నవారికి కూడ బియ్యం కార్డులు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

రాములవారి ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



మాచర్ల రూరల్: మండలంలోని గన్నవరం కోదండ రామస్వామి జీవరాశి ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం బుధవారం వేద పండితులు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 11న యంత్ర స్థాపన కార్యక్రమం జరుగుతుందని కుల మతాలకు అతీతంగా మహా అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు కోదండరామ దేవస్థాన కమిటీ నిర్వాహకులు చెప్పారు.

పట్టణంలోని లాడ్జిల తనిఖీ

మాచర్ల రూరల్: పట్టణంలోని పలు లాడ్జిలలో పోలీసులు బుధవారం ఎస్‌ఐ సంధ్యారాణి తనిఖీ చేశారు. లాడ్జిలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసేందుకు, ఎవరైనా అనుమానితులు ఉన్నారేమోనని తనిఖీలు చేసినట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచర్ల రూరల్: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచర్ల పట్టణంలో పూర్ణయ్య షెడ్డు బజారుని మాతా గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల దేవాలయంలో స్వామికి అభిషేకములు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు కె.వీరబ్రహ్మచారి, టి.రవిబాబు, కె.నాగేశ్వరరావు, కె.వెంకటాచారి, తాళ్ళూరి రవిబాబు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

బెల్లంకొండ: బైక్‌పై వెళుతున్న వారిని కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన ఉప్పు వెంకట సైదులు తన తల్లి శివకుమారితో కలిసి బైక్‌పై చంద్రాజుపాలెం నుంచి బెల్లంకొండ వైపు వస్తున్నారు. కాగా ఊరి చివరలో గల మూడు మర్రి చెట్ల సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వారిని ఢీ కొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న సైదులు, తల్లి శివకుమారి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. అటుగా వెళుతున్న ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.